# నేనూ—అతనూ

ముదుంబి నరసింహాచార్యగారు

నేనూ, అతనూ, బాల్యస్నేహితులం, సహాధ్యాయులం. లలితకళాపిపాసతో మేమిద్దరం కొన్నాళ్ళు కవితాకన్యక నారాధించాం; చిత్రకళాదేవత నుపాసించాం. మా కళాకుసుమాలు ప్రపంచోద్యానవనాన్ని సహజ మధురపరిమళంతో ముంచెత్తివేశాయి. తోడి విద్యార్థుల, ఉపాధ్యాయుల అత్యుక్తులు ఉత్ప్రేక్షలు వినలేక మా చెవులు గింగురులెత్తిపొయ్యాయి. తటిల్లతలవలె మా విద్యార్థిజీవనాలు అలౌకికమైన ఒక స్వర్గజ్యోతిని మెఱపించి యింతలో అదృశ్యమైపొయ్యాయి. కనులు తెరచి చూతుము కదా, ఆ స్వర్గీయ పవిత్రజీవనానికి ఎన్నో వేలమైళ్ల దూరంలో—భయంకరనరకవాసనలతో కూడిన సంసారసాగరంలోపడి కొట్టుకొంటున్నాం, నేనూ అతనూను.

అంతవరకూ, నేనూఅతనూ మధుర దివ్యస్వప్నపథాలలో విహరించే భావకవి చిత్రకారులం. ఇద్దరం ఏకపట్టణవాసులం, పవిత్రప్రేమోపాసకులం; అహంభావరహితులం. కాని యిప్పుడు జీవితంలో ఆ సారళ్య మాధుర్యాలేవి? ఒకానొక అవ్యక్తమైన ఆశంకతో మాహృదయాలు చలించిపోతున్నాయి. దివ్య స్వప్నరాజ్యాలనుంచి పదచ్యుతినంది, ఉదరనిర్వాహణంకోసం సామాన్యమానవవాసనలతో యీ సంసార మరుభూమిలో పరిభ్రమిస్తున్నాం. ఒక దారుణ యంత్రణ—దురంతపరివేదన—భీషణ అనుతాపం మా హృదయకుహరాల్లో, దుఃఖాంధకారంతో కలిసి ముఖరితమగుచున్నది. జీవితంలో యెన్నడెఱుంగని నిగూఢత, సంకుచితభావం, వ్రీడాప్రవర్తన, అనుభవంలోనికి వచ్చాయి. ఇవన్నీకలిసి మాయిద్దరి జీవితంమధ్య ఒకప్రగాఢ యవనికను కల్పించినవి. ఆ యవనికాభ్యంతరములలోనుండి మా హృదయాలు ఒకదానికొకటి పరితపించిపోతూన్నవి. మా జీవితనాటకాలలోని వియోగగీతికల యాలాపనలను లోకం ముక్తకంఠంతో పొగుడుతోంది. అతని కళాలాపసలలోని వర్ణరాగాలకు నాహృదయం ఉప్పొంగిపోతుంది. నాకవితాలాపాలలోని గీతికారాగాలతనికి శ్రావ్యములై హృదయసందేశాల నొసంగుతూంటాయి. అతను అల్పసంతుష్టి, నిరాడంబరుడు, నిస్పృహుడు. నేను అర్థవంతుడను, పైగా దానశీలుడను, కీర్తికాముడననికూడ లోకాపవాదు. ఇంత భేదం యేర్పడిపోయింది మా కుసుమసమాన జీవనాల్లో. ఎందుచేత? బాల్యం, సారళ్యం, మాధుర్యం, మాగ్ధ్యం మాజీవితాల్లోనాశనం అయిపోయాయి గావున. ఈ పాడు ప్రపంచకంలో, దుర్ధర్షణమైన కర్కశమైన జీవనభారం మా సుకుమారజీవితములపై విరుచుకుపడింది కనుక. కాని మాలో మిగిలిన, కొన ఊపిరితోనున్న బాల్యవాసనను ఆధారంగాచేసుకొని మాపరస్పరస్నేహం దినదినం అభివృద్ధిపొందుతూనే ఉంది. భావనామయమైన దివ్యలోకాల్లోనిభావోద్యానాల్లో, చెట్టాపట్టాలు వేసుకుని విహరిస్తున్నాం నేనూ అతనూను.

...... ......................
...... ......................
..................................
నేను అతన్ని చూసి యుగాలుగతించిపోయి నట్లుంది. కాని అతను నన్ను మరచిపోయా డని నే ననుకొనను. చిత్రకళాప్రపంచకంలో అతనితూలిక అత్యద్భుత ప్రావీణ్యాన్ని ప్రదర్శించింది. గ్రంథములు పత్రికలు అతని కళాకుసుమసౌరభమును దేశంలో వెదజల్లు తున్నాయి. నే నానందం పట్టజాలక పోయే వాడను. బహుశః అతను నన్ను కూడ ఆన వాలు పట్టే ఉంటాడు. నా కవితాకన్యక తారుణ్యప్రభలనీక్షించిచకితుడై యుంటాడు. నా కవితాకాంతకు లోకంలో జరిగే సన్మానా లకు అతను సంతోషింతోషించని నాడు నాకు సంతుష్టిలేదు. ఈవిధంగాఆత్మైక్య తను పొందితిమి నేనూఅతనూను.

## ౨

లోకం దృష్టిలో నాజీవితానికి వసంతో దయం అయింది. అంటే నావివాహం నిశ్చ యమైంది. నాహృదయం స్వప్నభంగం అయి నందుకు తల్లడిల్లిపోయింది. నేనొకవిధంగా నాసంతప్తహృదయాన్ని శాంతిపరచుకొన నిశ్చయించుకొన్నాను. కవితాకళాకన్యకల హృదయపూర్వకమైన ఆశీర్వాదవారిధార లతో తప్తజీవన మరుక్షేత్రాన్ని సించితం చేసుకొని సాఫల్యతనంద కాంక్షించాను. అతను తన కళాకాంతతోవచ్చి మధుర ఆశీస్సులతో నన్ను ముంచెత్తాలనియు—నేను అతనికి కనకాభిషేకంచెయ్యాలనియు నాఆశ. కళాప్రపంచకంలో అతనికి ప్రత్యేకత ప్రా ముఖ్యత ఉన్నాయని నాఉద్దేశ్యం. కాని ప్రత్యేక ఆహ్వానంతో అతన్ని పిలువడానికి నాకు ధైర్యం చాలలేదు. అతనిదృష్టిలో వివాహం ఒకపెద్దబంధనం. కావ్యసాహిత్య ప్రపంచకంలో స్వచ్ఛందవిహారంచేస్తూ మధురస్వప్నపథాలలో విహరించుతూండే కళోపాసిజీవితం, ఒక క్షుద్రబాలికకొరకు,- సామాన్యజీవితంలో కేంద్రీభూతం అయిపో తోందంటే అతనెంతమాత్రం ఒప్పుకోనడు. పవిత్రమైన కళోపాసనకు తుచ్ఛసంసార బంధనం గాఢప్రతిబంధకంఅని అతనితలంపు. అట్టివానిని నే నెట్లాహ్వానించగలను? స్వచ్ఛ తేజోమయమగు వినిర్మలగగన మండలములో విహరిస్తూన్న శుకముఖమునుండి పంజరబద్ధ పికజీవితాన్నిగూర్చి పాడించగలమా?

అహంభావంచేత అభిమానంచేత-ఇచ్ఛ కాలచేత ఆ తపోజీవితాన్ని భంగపరచడం నాతరమా? నేను సంకటంలో పడ్డాను. స్వయంగా అతని శుభదర్శనంచేసుకొనుటకు సాహసంలేకపోయింది. అనంతావేదనలచే నా హృదయం పరితప్తమైపోయింది. నాఉన్మాదా వస్థనుచూచి లోకం నవ్వింది—పరిహాసిం చింది. అంతుపొంతులేని భావవీచికలచే హృదయసాగరం పొర్లిపోయింది. నాహృద యంశిథిలమైపోయింది. నేను వినిర్మలశాంతిని ఆశించాను. హృదయాన్ని సుదృఢపరచు కొనుటకు కొంతవ్యవధి అవసరమైంది. కాని లోకం నామనోప్రవృత్తులను లక్ష్యపెట్టలేదు.

ఆశుభఘడియలు—కాదు, కుఘడి యలు రానేవచ్చినవి. నిర్విఘ్నంగా 'వివా

హం' అయింది అనిపించారు. దేశదేశముల లోని కళోపాసకులు తమతమ లలితకళా కుసుమాలతో నాజీవితవసంతోద్యానవ నాన్ని సాఫల్యత నందించారు. యథోచిత రీతి వారందఱు సత్కరింపబడ్డారు. నాకు అతను రానిలోటు దుర్భరమనిపించింది.

నాజీవితసంగీతంలో ఏదో అపశ్రుతి ఆవ హిల్లింది. అతని లలితకళాకుసుమాలతో నామస్తకం అభిషిక్తంకాలేదు. ఉన్నతా దర్శంతో కూడుకొన్న కళోపాసికి నేను తగిన గౌరవం చెయ్యలేకపోయ్యాను. అత నికి తగిన సత్కారం చెయ్యనిదే నామన స్సుకి శాంతిలేదు.

ఒక దారుణాశంకతో నాజీవితం దహించు కొని పోతోంది. పశ్చాత్తాపవహ్నికీలికలు నాఉత్తప్తహృదయపుటాన్ని భస్మంచేస్తు న్నాయి. నేను స్వయంగా ఆకళామూర్తిని ఆహ్వానింపలేకపోతిని, తన శుభాకాంక్షలను నాపై వర్షించటాన్కి అతనిఆత్మ ఎంతో పరితపించిపోయి ఉంటుంది. నాకు తెలుసు, అట్టి సద్యోగ మతనికి కల్గించకపోవుట నాదే తప్పు.

స్త్రీ అయినంతమాత్రంచే—స్త్రీజాతిని నేను దూషించను—కష్టసహిష్ణుత వినమ్రత సేవాభావముల సంఘటనమే స్త్రీ యని నా ఉద్దేశ్యం. స్వర్గధామంలోనుండి యీదేవీ మూర్తులు పాపపంకిలమైన యీపాడులోకం లోకి ఎందుకువచ్చారు? పురుషులకర్కశ పాషాణహృదయాల్ని కట్టుకొని తలపగుల కొట్టుకొనుటకేనా? ప్రేమయొక్క ఆదాన ప్రదానంలోనే జీవితమాధుర్యం యిమిడి ఉన్నదని నే ననుకొంటాను. నాశుభోదర్కా న్నివిని అతను సంతోషించే ఉంటాడు.

### 3

కాలం తన సంవత్సరావృత్తాల్లో ఏన్నో సార్లు దొర్లిపోయింది. అతని హృదయాన్ని అజ్ఞాతరూపంగా నేను అనుభవంలోకి తెచ్చు కొంటున్నాను. నాహృదయపరితాపంలో అతడు భాగం పంచుకున్నాడు. నేను అతని విషయంలో దురంతపరివేదన పొందుతున్నా నని ఆహృదయం గ్రహించింది. అతని సుకు మార హృదయాన్ని కష్టపెట్టాను. నాకెందు కింతవెఱ్ఱి. అతడు తన భౌతికశరీరాన్ని ఎల్లాగో అల్లాగ నావద్దకు జేరేస్తేనేకాని మాపవిత్రస్నేహం అభివృద్ధి పొందదూ? హృదయాలు నిష్కళంకాలయినప్పుడు బాహ్యాడంబరా లెందుకు?

ఇక మరేమీలేదు. అమూల్యమైన ఆ పవిత్రసుహృదత్వానికి స్మృతిచిహ్నంగా తుచ్ఛమైన నావజ్రాంగుళీయకం ఒకటి అతని దగ్గరఉంది. అతడా ఉంగరంతో తన బాహ్య శరీరాన్ని అలంకరించాడో లేదో నాకు తెలి యదుగాని—నేను దృఢంగా నమ్ముతున్నాను. అతని పవిత్రహృదయాగారంలో అది సజీవ రూపంగా భద్రపరుపబడిఉంది. దాని ప్రతి చ్ఛాయమే, ఇదిగో శాశ్వతంగా నాకళ్ళ యెదుట ప్రత్యక్షమైఉంది. ఆ అంగుళీయక స్మృతిచ్ఛాయలో నిరవధికశాంతి సామ్రా జ్యాన్ని అనుభవిస్తున్నాం, నేనూఅతనూను.